బీఆర్ఎస్ పాలనలోనే పేదలకు లబ్ధి


చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్‌పేట్: పేదింటి ఆడబిడ్డల వివాహాలకు షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి పథకాలు కొండంత అండగా నిలుస్తున్నాయని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ పేర్కొన్నారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద మంజూరైన 51 మంది లబ్ధిదారులకు రూ. 51.05 లక్షల విలువైన నిధులకు సంబంధించిన చెక్కులను గురువారం అంబర్‌పేట్ తహసీల్దార్ కార్యాలయంలో పంపిణీ చేశారు. కార్పొరేటర్ బి.పద్మావెంకట్‌రెడ్డి, తహసీల్దార్ భిక్షపతిలతో కలిసి లబ్ధిదారులకు ఎమ్మెల్యే చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... దేశంలో ఎక్కడా లేని విధంగా అప్పటి సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలతో పేదలు ఎంతో అభ్యున్నతి సాధించారని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల లబ్ధి చేకూర్చడం జరిగిందన్నారు. స్థానిక బీఆర్ఎస్ నాయకులు, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

త్వరలో జాబ్ కేలండర్‌కు అవకాశం

కవాడిగూడ: ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ పార్టీ నిరుద్యోగుల జాబ్ కేలండర్ ప్రకటించే విషయంలో ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటోందని మాజీ ఎమ్మెల్యే, ధరణి పోర్టల్ సభ్యుడు ఎం.కోదండరెడ్డి తెలిపారు. గురువారం ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో తెలంగాణ నిరుద్యోగ, ప్రైవేటు ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో ఖాళీగా ఉన్న పీఈటీ, పీడీ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన దీక్ష చేపట్టారు. ముఖ్య అతిథిగా హాజరైన కోదండరెడ్డి మాట్లాడుతూ... క్రీడలకు ప్రాధాన్యం కల్పించడంతో పాటు ప్రతి పాఠశాలలో పీఈటీ పోస్టులు భర్తీ చేశామని చెప్పిన కేసీఆర్ ప్రభుత్వం తొమ్మిదేళ్లుగా వ్యాయామ విద్యను నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. పీఈటీ అభ్యర్థుల సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. అనంతరం నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీలా వెంకటేశ్, అసోసియేషన్ అధ్యక్షుడు మాదగోని సైదులు గౌడ్ మాట్లాడుతూ.. నిరుద్యోగులపై నియంతలా వ్యవహరించిన గత ప్రభుత్వాన్ని గద్దె దించడంలో నిరుద్యోగ పీఈటీ అభ్యర్థులు క్రియాశీలకంగా పోరాటం చేశారని చెప్పారు. రాష్ట్రంలోని 1500 ఉన్నత పాఠశాలలకు పీఈటీ పోస్టులను త్వరలో రానున్న అనుబంధ డీఎస్సీ నోటిఫికేషన్‌లో భర్తీ చేసేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు శివప్రసాద్, వనపర్తి జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌తో పాటు నిరుద్యోగ పీఈటీ అభ్యర్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మహనీయుడు త్యాగరాజస్వామి


శ్రీవాణిని సత్కరిస్తున్న జస్టిస్ కాశీవిశ్వేశ్వరరావు

చిక్కడపల్లి: త్యాగరాయ గానసభలోని కళా సుబ్బారావు కళావేదికలో గానసభ, సమ్మోహన స్కూల్ ఫర్ మ్యూజిక్ నిర్వహణలో త్యాగరాజ స్వామి 177వ ఆరాధనోత్సవాలు గానసభ అధ్యక్షుడు కళా వి.ఎస్.జనార్దనమూర్తి ఆధ్వర్యంలో గురువారం మూడవ రోజు జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ కాశీవిశ్వేశ్వరరావు మాట్లాడుతూ... కర్ణాటక సంగీతానికి ఎనలేని సేవలందించిన మహనీయుడు త్యాగరాజ స్వామి అని అన్నారు. తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ పూర్వ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, సంగీత గురువు రమాప్రభ, గానసభ సభ్యురాలు గుండవరపు గీతాదేవి పాల్గొని సంగీత గురువు శ్రీవాణిను సత్కరించారు.

'ఫీవర్'లో కొనసాగుతున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల నిరసన

నల్లకుంట: వేతన బకాయిలు చెల్లించాలని కోరుతూ నల్లకుంట ఫీవర్ ఆస్పత్రి ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు చేపట్టిన నిరసన కార్యక్రమం రెండో రోజైన గురువారం కొనసాగింది. ఉదయం ఆస్పత్రి ఆవరణలో నిరసన చేపట్టిన ఉద్యోగులు తమకు అందాల్సిన మూడు నెలల వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. రెండో రోజు నిరసన కార్యక్రమానికి టీఎంహెచ్ఈయూ సంఘీభావం తెలిపింది. ఈ సందర్భంగా టీఎంహెచ్ఈయూ ర్రీటా ప్రధాన కార్యదర్శి జాలిగామ అశోక్, ఫీవర్ ఆస్పత్రి శాఖ అధ్యక్షురాలు లావణ్య మాట్లాడారు. అరకొర వేతనాలతో విధులు నిర్వహిస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రతి నెలా సక్రమంగా వేతనాలు చెల్లించకుండా పెండింగ్‌లో పెట్టడం సరైనది కాదన్నారు. వేతన బకాయిలు చెల్లించాలని కోరుతూ ఉద్యోగులు శాంతి యుతంగా నిరసన చేపట్టినప్పటికి ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాకపోవడం శోచనీయమన్నారు. టీఎంహెచ్ఈయూ ఫీవర్ ఆస్పత్రి శాఖ ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్, ఉపాధ్యక్షుడు జనార్ధన్, నాగలక్ష్మి, చంద్ర శేఖర్, శివ, కోశాధికారి శ్రీకాంత్ నాయకులు, ఉద్యోగులు బాలరాజు, కవిత, సతీష్, అనూష, మహేశ్వరి, సురేందర్, అనిల్, ప్రవీణ్, కృష్ణ వేణి పాల్గొన్నారు.

బస్తీవాసులకు పునరావాసం కల్పించాలని ఆందోళన


అదనపు కలెక్టర్ మధుమోహన్‌తో చర్చిస్తున్న మాజీ ఎమ్మెల్యే కోదండరెడ్డి, శంకర్ తదితరులు

చిక్కడపల్లి: పేదల ఇళ్లను కూల్చిన చోటే ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలని దళితుల బహుజన ఫ్రంట్ ఆధ్వర్యంలో వివేకానందనగర్ బస్తీలో కలెక్టర్ ముందు బాధితులు గురువారం ఆందోళనకు దిగారు. అనంతరం ధరణి కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే ఎం.కోదండరెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ మధుమోహన్‌కు వినతిపత్రాన్ని అందించి చర్చలు జరిపారు. ఇళ్లు కోల్పోయిన బాధితులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయిస్తామని హామీ ఇచ్చారు. దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ మాట్లాడుతూ... దళితుల ఇళ్లను కూల్చివేసిన ప్రదేశంలోనే ఇళ్లను నిర్మించి ఇవ్వాలని అప్పటివరకు తాత్కాలికంగా షెల్టర్‌ను ఏర్పాటు చేసి ఆహారం, నీటి వసతి, పాలు పంపిణీ చేయాలని, తాత్కాలికంగా బాత్‌రూమ్‌లను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. తప్పుడు కేసులు పెట్టి దళితులను వేధిస్తున్న శాతాబ్ది అపార్ట్‌మెంట్ నివాసి శ్రీధర్‌రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యురాలు , డీబీఎఫ్ నేత పులి కల్పన, బాధితులు భాగ్యలక్ష్మి, భారతమ్మ, కన్యాకుమారి, పూజ, ఆమని, ఇందు, కృష్ణ, జాన్సీ, వసంత్, ఆనంద్, జ్ఞానేశ్వర్, నరేశ్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు. బాధితులకు కోదండరెడ్డి దుప్పట్లను పంపిణీ చేశారు. పీసీసీ కార్యదర్శి జి.ఎన్ జి.ఎస్.కేశవ్, రాజ్‌కిసోర్, బల్వంతరావు తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు కార్పొరేటర్ పరామర్శ...

గాంధీనగర్ డివిజన్‌లోని స్వామి వివేకానందనగర్ బస్తీవాసుల ఇండ్లు కూల్చివేసి వారిని రోడ్డున పడేలా చేశారని, 10 రోజుల్లో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కేటాయించాలని కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ డిమాండ్ చేశారు. గురువారం రాత్రి వివేకానందనగర్ బస్తీని సందర్శించి వారిని ఆమె పరామర్శించారు. ఇప్పటికే కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి కలెక్టర్‌ను ఆదేశించారని ఆమె తెలిపారు. ముషీరాబాద్ తహసీల్దార్ వెంకటలక్ష్మికి వినతిపత్రాలు సమర్పించామని వీరికి త్వరలోనే ప్రత్యామ్నాయంగా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని ఆమె తెలిపారు. కార్యక్రమంలో బీజేవైఎం డివిజన్ అధ్యక్షుడు జి.అరుణ్‌కుమార్, సంపత్‌యాదవ్, ప్రవీణ్, బస్తీ నేతలు శ్యామ్ సుందర్, అశోక్, జ్ఞానేశ్వర్, ఆనంద్ రావు, భారతి, సువర్ణ, కన్యాకుమారి, సువర్ణ, భాగ్యలక్ష్మి, స్వప్న, ఝాన్సీ, ఇందు, పూజ, రేఖ తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్ పాఠశాలలకు చేయూతనివ్వాలి


సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేస్తున్న ప్రతినిధులు

అంబర్‌పేట్: రాష్ట్రంలో ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల చేయూతనివ్వాలని తెలంగాణ గుర్తింపు పొందిన పాఠశాలల యాజమాన్యల సంఘం (ట్రస్మా) ప్రతినిధులు సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. గురువారం సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి రాష్ట్రంలో సుమారు 55 శాతం మంది విద్యార్థులకు తక్కువ ఫీజులతో నాణ్యమైన విద్య అందిస్తున్నామని వివరించారు. మరింత నాణ్యమైన విద్య అందించేందుకు ట్రస్మా ఆధ్వర్యంలో రాష్ట్రంలో రీసెర్చ్ ట్రెనింగ్ అండ్ డెవలప్‌మెంటు కేంద్రాన్ని నిర్వహించి ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తామన్నారు. దీని కోసం ప్రభుత్వ సహకారం కావాలని కోరారు. కేంద్రం నిర్వహణకు ఐదు ఎకరాల ప్రభుత్వ స్థలం కేటాయించి భవనాన్ని నిర్మించేందుకు తోడ్పాటును అందించాలని సీఎంకు విజ్ఞప్తి చేశారు. ట్రస్మా రాష్ట్రంలో సుమారు పది వేల కుపైగా పాఠశాలలకు ప్రాతినిధ్యం వహిస్తుందని అందుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలో నాణ్యమైన విద్యకు ప్రభుత్వానికి ట్రస్మా తన వంతు సహకారం అందించేందుకు సిద్ధంగా ఉంటామన్నారు. విద్యా హక్కు చట్టం ప్రకారం 25 శాతం విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలని అలాగే పాఠశాలలకు వాణిజ్య విద్యుత్, నీరు, ఆస్తి పన్ను, మినహాయించాలని కోరారు. ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు సాధుల మధుసూదన్, ప్రధాన కార్యదర్శి రామేశ్‌రావు, కోశాధికారి రాఘవేంద్రరెడ్డి, సలహాదారులు యాదగిరి శేఖర్‌రావు, జైసింహగౌడ్, నారాయణరెడ్డి, కోమటిరెడ్డి గోపాల రెడ్డి పాల్గొన్నారు.

ముషీరాబాద్ సమగ్రాభివృద్ధికి చర్యలు

ఎమ్మెల్యే ముఠా గోపాల్


రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, కార్పొరేటర్ గౌసుద్దీన్ తాహా

ముషీరాబాద్: ముషీరాబాద్ నియోజకవర్గం సమగ్ర అభివృద్ధికి చర్యలు చేపట్టామని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. గురువారం భోలక్‌పూర్ డివిజన్‌లోని సందాని వీధిలో రూ. 5 లక్షల నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే గోపాల్, కార్పొరేటర్ గౌసుద్దీన్‌తాహాతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులను పూర్తి చేసి అనంతరం రోడ్డు నిర్మాణ పనులు చేపట్టామన్నారు. మరో వీధిలో రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైనా డ్రైనేజీ పైపులైన్ అనంతరం స్థానిక ప్రజల విజ్ఞప్తి మేరకు రోడ్డు వేస్తామన్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్పొరేటర్ గౌసుద్దీన్ మాట్లాడుతూ డ్రైనేజీ, మంచినీటి సమస్యలు ఉన్నచోట పైపులైన్ నిర్మాణ పనులు అనంతరం రోడ్డు వేస్తున్నామని పేర్కొన్నారు. బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ, భోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు వై.శ్రీనివాస్‌రావు, ఉపాధ్యక్షులు శంకర్‌గౌడ్, ఆర్.శ్రీనివాస్, బీసీ సెల్ అధ్యక్షులు ఉమాకాంత్, డివిజన్ మైనార్టీ కమిటి అధ్యక్షులు, కార్యదర్శులు మగ్బూల్, జబ్బార్, యువజన కమిటీ అధ్యక్షుడు సాయి, ఎంఐఎం పార్టీ నాయకులు షరీఫ్, అజీబ్ ఉస్మాన్ అలీ, జీహెచ్ఎంసీ డీఈ సన్నీ, ఏఈ సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతతో అభివృద్ధి పనులను పూర్తిచేయాలి

అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్


డ్రైనేజీ పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు

నల్లకుంట: నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పక పాటించాలని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ కాంట్రాక్టర్లకు సూచించారు. గురువారం నల్లకుంట డివిజన్ పరిధిలోని సంజయ్‌గాంధీ నగర్‌లో రూ. 16 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న డ్రైనేజీ పైప్ లైన్ పనులకు స్థానిక కార్పొరేటర్ అమృతతో కలిసి ఎమ్మెల్యే కాలేరు శంకుస్థాపన చేశారు. అనంతరం బస్తీలో పాదయాత్ర చేసి స్థానికంగా నెల కొన్న ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జల మండలి విజ్ఞానపురి కాలనీ సెక్షన్ మేనేజర్ షాకీర్, బీఆర్ఎస్ నాయకులు భాస్కర్ గౌడ్, కూర నరేందర్, ఇర్ఫాణ సుల్తాన, బి.రఘురామ్‌రెడ్డి, మూర్తి, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

'మాయని గాయాల నెత్తుటి చరిత్ర' పుస్తక పరిచయ సభ 4న



కాచిగూడ: యదార్థ సంఘటనల సమాహారం పేరుతో ప్రముఖ రచయిత మంగళారపు లక్ష్మణ్ రచనలో వెలువడిన 'మాయని గాయాల నెత్తుటి చరిత్ర' పుస్తక పరిచయ సభ ఈ నెల 4వ తేదీన (ఆదివారం) రవీంద్రభారతిలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రచయిత జాకీర్ అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీపీఎస్సీ మాజీ చైర్మన్ ఆచార్య ఘంటా చక్రపాణి పాల్గొంటారన్నారు. కవి, రచయిత డాక్టర్ తైదల అంజయ్య పుస్తక పరిచయం చేస్తారు.

చిన్నారుల్లో సైన్స్‌పై అవగాహన పెంచాలి


ర్యాలీని ప్రారంభిస్తున్న భూపతి వెంకటేశ్వర్లు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సైన్స్ పట్ల పిల్లల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలంగాణ బాలోత్సవం అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని సైన్స్‌పై అవగాహన పెంచేందుకు ప్రచార ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో బాలోత్సవం కార్యదర్శి ఎం.సోమయ్య, ఉపాధ్యక్షులు మమత, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సుందరకాండ కార్యసిద్ధి హోమం

చిక్కడపల్లి: వివేక్‌నగర్‌లోని ఆంజనేయ స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న అష్టోత్తర శత హనుమాన్ చాలీసా సహిత శ్రీమత్ సుందరకాండ కార్యసిద్ధి హోమం గురువారం ముగిసింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ ఎం.దేవనాథం మాట్లాడుతూ... శత హనుమాన్ శ్రీమత్ సుందరకాండ కార్యసిద్ధ హోమం ఎంతో వైభవంగా 5 రోజులపాటు జరగడం ఆనందదాయకమన్నారు. ఆలయ ఈఓ ఎం.దేవనాథం, ప్రధాన అర్చకులు బుగ్గాలక్ష్మీపతి శర్మ, కందాల వెంకటాద్రి, ఎస్‌బీవీఎస్ ఆచార్య, రాజశేఖర్‌శర్మ, మాజీ కమిటీ సభ్యులు మురుకి గణేష్, తమ్మన వేణు గోపాలరావు, డాక్టర్ వెంకటరమణ హోమం నిర్వహించారు.

మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యం

చిక్కడపల్లి: మతి స్థిమితం లేని వ్యక్తి అదృశ్యమైన సంఘటన చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ సీతయ్య, ఎస్ఐ శిశుపాల్‌రెడ్డి సమాచారం మేరకు... సూర్యానగర్‌కు చెందిన వనిత, మనోజ్‌కుమార్(46) భార్యాభర్తలు. మనోజ్ కుమార్‌కు మతిస్థిమితం సరిగా లేదు. రెండు నెలల క్రితం కనిపించకుండా పోయాడు. పోలీసులు గాలించి ఆచూకీ కనుగొని అతడిని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మళ్లీ ఆయన కనిపించకుండా పోయాడు. భార్య వనిత పోలీసులకు ఫిర్యాదు చేసింది.

లోక్‌సభ ఎన్నికల్లో అత్యధిక స్థానాలను సాధిస్తాం

బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గౌతమ్‌రావు


చంద్రశేఖర్‌ను అభినందిస్తున్న డాక్టర్ గౌతమ్‌రావు

కాచిగూడ: త్వరలో జరుగనున్న లోక్‌సభ ఎన్నికలలో తెలంగాణలో బీజేపీ అత్యధిక స్థానాలలో విజయం సాధించడం ఖాయమని ఆ పార్టీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్ రావు పేర్కొన్నారు. బీజేపీ తెలంగాణ రాష్ట్ర సంఘటన ప్రధాన కార్యదర్శిగా చంద్రశేఖర్ నూతనంగా నియమితులైన సందర్భంగా గురువారం బర్కత్‌పురాలోని బీజేపీ నగర కార్యాలయంలో ఆయనను ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా గౌతమ్‌రావు మాట్లాడుతూ... రాజస్థాన్ రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడంలో చంద్రశేఖర్ విశేషమైన కృషి చేశారన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు ప్రకాష్ రెడ్డి, అట్లూరి రామకృష్ణ, పాండుయాదవ్, సురేందర్ రెడ్డి, జ్యోతి, ప్రవీణ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సుకన్య

ముషీరాబాద్: వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి జాతీయ స్థాయి సమైక్యత శిబిరాలలో పాల్గొని ప్రతిభ కనబరచిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.సుకన్య అభినందించారు. కళాశాలలో బీఎస్ఈ మొదటి సంవత్సరం చదువుతున్న వేణుకుమార్ ఇటీవల చెన్నైలో జరిగిన జాతీయ సమైక్యత శిబిరంలో పాల్గొన్నారు. హైదరాబాద్‌లో జరిగిన మరో శిబిరంలో బీకామ్ విద్యార్థిని పాల్గొన్నారు. వీరిని కళాశాల ప్రిన్సిపాల్ ప్రత్యేకంగా అభినందించి విద్యార్థులు అన్ని రంగాలలో రాణించాలని ఆకాంక్షించారు. మహారాష్ట్రలోని నాసిక్‌లో జరిగిన 27వ జాతీయ యువజన ఉత్సవాలలో తెలంగాణ బృందానికి నాయకత్వం వహించిన భౌతిక శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ జె.చిన్నబాబును ప్రిన్సిపాల్, ఇతర అధ్యాపకులు అభినందనలు తెలిపారు. కళాశాల అధ్యక్షుడు ఎస్.రవిప్రసాద్, పి.వెంకట ఈశ్వర్, ఎ.తిరుపతి, ఇ.నర్సింగ్‌రావు, డాక్టర్ అనిల్‌కుమార్, డాక్టర్ విజయనిర్మల, డాక్టర్ మల్లీశ్వరి పాల్గొన్నారు.

నియామకం


శ్రీకాంత్‌గౌడ్‌కు నియామకపత్రాన్ని అందజేస్తున్న అనిల్‌కుమార్‌యాదవ్

ముషీరాబాద్: ముషీరాబాద్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు లింగాల శ్రీకాంత్‌గౌడ్ కాంగ్రెస్ సికింద్రాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. గురువారం ఆయనకు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎం.అనిల్‌కుమార్‌యాదవ్ నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా లింగాల శ్రీకాంత్‌గౌడ్ ముషీరాబాద్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు అర్హులైన ప్రజలకు ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందేలా తనవంతు కృషి చేస్తామన్నారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ విజయమే లక్ష్యంగా అంకిత భావంతో పని చేస్తామని పేర్కొన్నారు.

ప్రధాన కార్యదర్శిగా యాదగిరిగౌడ్...



చిక్కడపల్లి: కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా బంటారం యాదగిరి నియమితులయ్యారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎం.అనిల్‌కుమార్‌యాదవ్ ఆయనకు నియమాక పత్రాన్ని అందజేశారు.

జన్మదిన శుభాకాంక్షలు


కేక్ కట్ చేస్తున్న ఫీవర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శంకర్

నల్లకుంట: తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (టీఎంహెచ్ఈయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాలిగామ అశోక్ ఆధ్వర్యంలో గురువారం నల్లకుంట ఫీవర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శంకర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు, ఆస్పత్రి సిబ్బంది సూపరింటెండెంట్‌తో కేక్ కట్‌చేయించి, శాలువాతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఆస్పత్రి సీఎస్ ఆర్ఎంవో డాక్టర్ జయలక్ష్మి, డీసీహెచ్ ఆర్ఎంవో డాక్టర్ చంద్ర శేఖర్, ప్రొఫెసర్ ఆఫ్ మెడిసిన్ డాక్టర్ కొండల్ రెడ్డి, టీఎంహెచ్ఈయూ ఆస్పత్రి శాఖ అధ్యక్షురాలు లావణ్య, కోశాధికారి రాజ్‌కుమార్, కోశాధికారి శ్రీకాంత్, ఉపాధ్యక్షురాలు పద్మజ, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని వినతి


ఈస్ట్‌జోన్ డీసీపీకి వినతిపత్రం ఇస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

అంబర్‌పేట్: దుర్గాబాయి దేశ్‌ముఖ్ కాలనీలో భద్రతపై చర్యలు తీసుకోవాలని ఈస్ట్‌జోన్ డీసీపీ సాయిశ్రీకి కాలనీ వేల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు విజ్ఞప్తి చేశారు. గురువారం సీపీఎల్ రోడ్‌లోని డీసీపీ కార్యాలయంలో కలిసి కాలనీలోని సీసీ కెమరాల ఏర్పాటు, పోలీసుల గస్తీ పెంచాలని వినతిపత్రం అందించారు. దీనిపై పరిశీలించి త్వరలోనే చర్యలు తీసుకుంటానని డీసీపీ హామీ ఇచ్చారు. కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు కొండా లక్ష్మీకాంత్‌రెడ్డి, డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు, పి.గోవర్ధన్ రెడ్డి, ప్రసన్న, పుట్ట పాండు రంగయ్య పాల్గొన్నారు.

ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం

కాచిగూడ: బీసీ అభివృద్ధికి బాటలు వేసిన బీహార్ మాజీ సీఎం కర్పూరి ఠాకూర్‌కు కేంద్ర ప్రభుత్వం దేశ అత్యున్నత పురస్కారమైన భారతరత్నను ప్రకటించడం పట్ల బీజేపీ నగర ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్ హర్షం ప్రకటించారు. ఈ నేపథ్యంలో గురువారం కాచిగూడలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ చిత్ర పటానికి కార్పొరేటర్ బీజేపీ నేతలు, కార్యకర్తలతో కలిసి పాలాభిషేకం చేశారు. బీజేపీ నేతలు ఎ.సూర్యప్రకాష్ సింగ్, సుభాష్ పటేల్, కృష్ణ కుమార్, శీర్‌సాగర్, హాజారి బాబు, బల్వీర్, బాల ప్రసాద్, మహేష్, బి.భీమ్‌రాజ్, సూరి, కృష్ణ, యాదగిరి పాల్గొన్నారు.

మెడికల్ రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: వ్యవసాయ శాఖలో రిటైర్డ్ అయిన అధికారులకు మెడికల్ రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని తెలంగాణ వ్యవసాయ శాఖ అధికారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వైద్యనాథ్ కోరారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ రిటైర్డ్ వ్యవసాయ శాఖ అధికారుల సంక్షేమ సంఘం 16వ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వైద్యనాథ్ మాట్లాడుతూ... వ్యవసాయ శాఖ అధికారులు రిటైర్డ్ అయినా తమ సేవలను ప్రత్యేక్షంగా, పరోక్షంగా కొనసాగిస్తున్నారని అన్నారు. స్వచ్ఛందంగా గ్రామాలు, మండల స్థాయిలో పర్యటిస్తూ వారి సలహాలు అందించడం గొప్ప పరిణామమని అన్నారు. రైతుల ఆత్మహత్యలపైన కూడా అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిక అందించడం వారి పనితనానికి నిదర్శనమన్నారు. అలాంటి ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం గుర్తించి పరిష్కరించాలన్నారు. ముఖ్యంగా రిటైర్డ్ వ్యవసాయ శాఖ అధికారుల సంఘానికి భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరారు. తెలంగాణ రిటైర్డ్ వ్యవసాయ శాఖ అధికారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు టి.రంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి డి.చంద్రశేఖర్‌రెడ్డి, కోశాధికారి మురళీధర్‌రాజు, ఉపాధ్యాయులు రాజారెడ్డి, రిటైర్డ్ డీడీఏ ప్రమోతీష్ చంద్రారెడ్డి, వ్యవసాయ శాఖ అధికారుల సంఘం చైర్మన్ బి.కృపాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కృపాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మానందంకు జన్మదిన శుభాకాంక్షలు



కాచిగూడ: ఫిలిం అనలిటికల్ అండ్ అప్రిసియేషన్ సొసైటీ, ఇంటర్నేషనల్ తెలుగు మూవీ అసోసియేషన్ అధ్యక్షుడు సంస్కృతి రత్న డాక్టర్ కె.ధర్మారావు గురువారం పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ బ్రహ్మానందంను వారి నివాసంలో కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. శాలువా, మకుటంతో సత్కరించి తిరుమల–తిరుపతి దేవస్థానం రూపొందించిన కేలండర్‌ను బహూకరించారు. రెండున్నర దశాబ్దాలుగా తనకు జన్మదిన శుభాకాంక్షలు అందజేస్తున్న ఆత్మీయుడని బ్రహ్మానందం అన్నారు. కార్యక్రమంలో ఫాస్, ఇట్మా సంస్థల ప్రతినిధి సూరపనేని ప్రసాద్, ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యులు కృష్ణాది శేష తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: నగర పోలీసు కమిషనర్ కార్యాలయంలో ఏఏవోగా స్వచ్ఛంద పదవీ విరమణ చేసిన గిడి సత్యనారాయణను గురువారం పలువురు ప్రముఖులు అభినందనలు తెలిపి ఘనంగా సత్కరించారు. పదవీ విరమణ అనేది ఉద్యోగానికే కానీ వయస్సుకు కాదని నిరంతరం సామాజిక సేవలో పాల్గొనే అవకాశం ఉంటుందని ప్రముఖ సామాజికవేత్త రాయపాటి రవి, విజ్ఞాన్ విద్యానికేతన్ కరస్పాండెంట్ కె.ఐజాక్ అరవిందం తెలిపారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ గ్రేటర్ హైదరాబాద్ మాజీ అధ్యక్షులు ఎం.ఎస్.ప్రకాష్‌రావు, సీనియర్ జర్నలిస్టు కందుకూరి నర్సింహ, దుర్గం మోహన్‌నేత, ఆర్.ప్రవీణ్‌గౌడ్, వెంకటకృష్ణారావు (బబ్లూ) సంతోష్‌గౌడ్, ఎం.దామోదర్ రెడ్డి, రాజు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కేవీపీఎస్ డైరీ ఆవిష్కరణ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సామాజిక ఉద్యమకారుల కరదీపి కేవీపీఎస్ డైరీని గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో టీపీఎస్‌కే రాష్ట్ర కన్వీనర్ జి.రాములు ఆవిష్కరించారు. మొదటి డైరీని కేవీపీఎస్ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఏఐకేఎస్ రాష్ట్ర కార్యదర్శి టి.సాగర్‌కు అందజేశారు. కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కై ల్యాబ్‌బాబు, డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, జగదీష్, భూపతి వెంకటేశ్వర్లు, నల్లపు సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

జీవో నెంబర్-6ను రద్దు చేయాలి

కవాడిగూడ: గంగపుత్రులకు శాపంగా మారిన జీవో నెంబర్ 6ను రద్దు చేసి తెలంగాణలో ఉన్న గంగపుత్రులకు న్యాయం చేయాలని తెలంగాణ ప్రదేశ్ గంగపుత్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడప శ్రీహరి, నాయకులు ఆర్.కె.భగవాన్, అంబటి సుధాకర్ గంగపుత్రులు, రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. తెలంగాణ ప్రదేశ్ గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన డైరీ ఆవిష్కరణ కార్యక్రమానికి మంత్రిని ఆహ్వానించినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత గంగపుత్రులకు గత పాలకులు తీరని అన్యాయం చేశారని, కనీసం సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం గంగపుత్రులకు న్యాయం చేయాలని వారు కోరారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించి గంగపుత్రుల సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

బహిరంగ చెత్త డంప్ కేంద్రాల తొలగింపునకు చర్యలు

అంబర్‌పేట్: బహిరంగ చెత్త కేంద్రాలను దశలవారీగా శాశ్వత ప్రాతిపదికన తొలగించేందుకు తక్షణమే చర్యలు కొనసాగించాలని జీహెచ్ఎంసీ సర్కిల్-16 డీఎంసీ మారుతీదివాకర్ తెలిపారు. గురువారం అంబర్‌పేట్‌లో ఏఎంహెచ్‌వో జ్యోతిబాయి, ఎస్ఎఫ్ఏ సిబ్బందితో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. అంబర్‌పేట నియోజకవర్గంలో సుమారు 82 బహిరంగ చెత్త డంపు కేంద్రాలు ఉన్నాయని వాటిని తక్షణమే తొలగించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. నియోజకవర్గంలో స్వచ్ఛ హైదరాబాద్ స్ఫూర్తితో క్లినింగ్ అండ్ గ్రీన్ ఉండేలా ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలని ఆయన సిబ్బందికి సూచించారు. ప్రజలకు అవగాహన కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. ఇంటింటికీ వచ్చే స్వచ్ఛ ఆటోలకు తడి, పొడి చెత్త వేరు చేసి ఇవ్వాలని ఆయన ప్రజలను కోరారు.